## మినీకథ

# ట్రాప్

సామవేదుల వెంకట రామశాస్త్రి



ఆ రోజు సాయంత్రం నేను తీరిగ్గా కూర్చొని పేపరు చదువుకొంటున్న వేళ ప్రక్కింటి విశ్వనాథం వచ్చి బీరువా కొనడానికి బజారు కెళ్దాం రమ్మనేసరికి నా గుండెల్లో డజను తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లు ఒక్కసారి పరిగెత్తేయి.

ఎందుకంటే విశ్వనాథానికి ఆ చుట్టుపట్ల పిసినారిగా మంచి పేరుంది. అదికాక, జిడ్డుగాడు, నసగాడు వగైరా ముద్దుపేర్లున్నాయి. ఏ బేరంలోనైనా సరే తనకెంత లాభం వస్తుందన్న విషయమే కాని అవతల వాడు ఎంత బాధపడుతున్నాడన్న విషయాన్ని అసలు ఆలోచించడు.

ఒక బేరం మొదలుపెట్టేడంటే, జిడ్డులా అవతలవాణ్ణి వదలక నానా బాధలు పెట్టి తను చెప్పిన రేటుకే సరుకుని తీసుకుపోగల సమర్థుడు. ఇలాంటి విషయాల్లో అవతలి వాడు వచ్చిబూతులు తిడుతున్నా తన్ను కాదన్నట్టు దులపరించుకుపోగల మహా జ్ఞాని.

ఇప్పుడర్థమయి వుంటుంది మీకు—నేను వాడితో బయలుదేరడానికి ఎందుకు జంకుతున్నానో! అయితే, వాడు శ్రేష్ఠమయిన తుమ్మబంక లాంటి వాడవడంవల్ల వాడితో బయలుదేరక తప్పలేదు.

అందులోకి, స్వతహాగా నేను చిన్న సైజు రచయిత నవడంవల్ల, వాడు షాపు వాణ్ణి ఎలా ట్రాప్ చేసి బీరువా చవగ్గా కొట్టేస్తాడో చూద్దామన్న కుతూహలం కూడా లేకపోలేదు.

సిటీ అంతా గాలించినా కూడా ఎవరూ మా వాడి ట్రాప్‌లో పడలేదు. అయినా నా పిచ్చిగాని, ఇదేమైనా కూరగాయల బేరమా ఎవరైనా మా వాడి ట్రాప్‌లో పడడానికి. అంతా ఫిక్సెడ్ రేట్ల వ్యవహారమాయె!

వెతగ్గా, వెతగ్గా మా వాడికి సరైన జోడీ దొరికింది. వాడు ఇన్‌స్టాల్‌మెంట్ బేసిస్‌లో బీరువాలమ్ముతాడు. ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ కట్టేసి, బీరువా తీసుకుపోవచ్చు. బీరువాల నాణ్యం కూడా బాగుంది. పై పెచ్చు రేటు కూడా మిగతాబీరువాల్లో సగానికి సగం.

మనకు ఇన్ని లాభాలు చూపిస్తున్నాడంటే, ఇందులో ఏదో మోసం ఉండి ఉంటుందని విశ్వనాథాన్ని చాటుకి పిల్చి చెప్పేను. దానిని వాడు తేలికగా చప్పరించేస్తూ-"ఒక వేళ ఏదైనా మోసం జరిగితే మిగతా ఇన్‌స్టాల్‌మెంట్లు ఎగ్గొడితే సరి! ఎలాగూ మన మిప్పుడిచ్చేది వంద రూపాయలే కదా" అన్నాడు. నేను మరేమీ మాట్లాడలేదు.

మా వాడు ఆ షాపువాణ్ణి అంత తేలికగా వదల్లేదు. బీరువానంతా పట్టి పట్టి పరీక్షించేడు. ఆ బీరువా తాళం దేంతోనైనా వస్తుందన్నాడు. దానికా షాపువాడు, విశ్వనాథం దగ్గర తాళం చెవుల గుత్తి తీసుకొని అన్ని తాళం చెవుల్తో దాన్ని తిప్పి, ఆ బీరువా చెత్తది కాదని నిరూపించేడు.

అన్ని పరీక్షలూ అయేక, ఇంకా రేటు తగ్గించమని అరగంట బేరమాడి, కొంచెం తగ్గించుకొని మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించి, బీరువా తీసుకొని బయటపడ్డాం.

మొత్తానికి ఇవాళ విశ్వనాథం ఆ బీరువాలవాణ్ణి ట్రాప్‌చేసి, బీరువా చవగ్గా కొట్టెయ్యగలిగేడు.

వారం రోజుల తర్వాత అర్ధరాత్రి ప్రక్కింటో ఏదో గోల వినిపిస్తే ఏమిటోనని చూసేను. విశ్వనాథం తల పట్టుకొని కూర్చుని వున్నాడు. అతని భార్య ఒకటే శోకాలు పెడుతోంది.

నన్ను చూడడమేమిటి, విశ్వనాథం బావురుమన్నాడు. "చూడు జగన్నాథం! మేము సెకెండ్‌షోకి వెళ్ళి వచ్చేసరికి ఎవడో దొంగ వెధవ బీరువాలోనున్న నగలూ, డబ్బూ మొత్తం దోచుకెళ్ళిపోయాడు" అని మళ్ళీ బావురుమన్నాడు. ఆ నగలూ, డబ్బూ సుమారు 30 వేలుంటాయని నాకు తెలుసు.

అయినా, గుట్టు చప్పుడు కాకుండా (ఏదైనా చప్పుడయితే మా ఇంట్లోకి స్పష్టంగా వినిపిస్తుంది తలుపులు ఎలా తెరవగలిగారన్నదే ఆశ్చర్యం. అందులోకీ విశ్వనాథం డూప్లికేటు తాళంచెవులు ఎప్పుడూ ఇంట్లో వుంచడు.

ఆలోచించగా, ఆలోచించగా నాకు రహస్యమంతా, మంచు విడిపోయినట్లు విడిపోయింది.

ఇదంతా ఆ బీరువాల వాడి పనే అయ్యుంటుంది. ఆ బీరువాల వాడికి విశ్వనాథం గురించి బాగానే తెలిసివుండాలి.

బీరువా డూప్లికేట్ కీ వాడి దగ్గర ఉండి ఉంటుంది. అదికాక, విశ్వనాథం తాళం చెవులతో బీరువా తీస్తున్నట్లు నటిస్తూ వాటి అచ్చులు కూడా తీసుకుని ఉంటాడు. అలా చేసి, చౌకగా బీరువా మావాడికి అంటగట్టి ఆ తర్వాత సమయం చూసుకొని ఇల్లు దోచేసేడు.

అందులో ఉన్నదంతా బ్లాక్ మనీయే కాబట్టి మావాడు పోలీస్ రిపోర్టివ్వలేదని వాడు ఊహించే వుంటాడు. అలా ఊహించే వాడు జాగ్రత్తగా ఆలోచించి ట్రాప్ వేసేడు. మా వాడు ఆ ట్రాప్‌లో దర్జాగా పడ్డాడు.

ఈ విషయంకాని మావాడికి చెప్తే ఇంకా లటో, దిటో మంటాడని, వాడికి విషయం చెప్పక ఏవో నాలుగు ఓదార్పు మాటలు చెప్పి బయటపడ్డాను. ●